# కలిసిన ధృవాలు

బస్ స్టాప్ దగ్గర ఎవరో చప్పట్లు కొట్టారు. వెనక్కి తిరిగాను. నీరజ! దగ్గరగా వచ్చింది. "ఎన్నాళ్లకు, ఎన్నాళ్ళకు?" అని చేయి చాపాను.

"ఎన్నేళ్ళకు అను, పద కాఫీ తాగుదాం" అన్నది. నా చేయి వదలకుండా, గట్టిగా నొక్కుతోంది.

"కాఫీయా? వద్దమ్మా. బస్సు వెళ్ళిపోతుంది. వూ చెప్పు ఎలా వున్నావు? బ్యాంకులోనే యింకా ఉద్యోగమా?" అన్నాను. ఒక చూపు బస్సులమీద వుంచుతూనే.

"పోవోయి, మరో బస్సులో వెళ్ళొచ్చునులే. లేకపోతే నేను దింపుతాలే ఆటోలో. పద వెళదాం. కాఫీ అర్జంటుగా అవసరమనిపిస్తోంది" చనువుగా లాగింది చేయి. వెళ్ళాము. కాఫీ వచ్చేలోగా నీరజను పరీక్షగా చూశాను.

"ఏమిటి చూస్తున్నావు? ఎంత వరకూ మారాననా? ఏమంత మారలేదు. ఒక డజను సంవత్సరాల వయస్సు మాత్రం కూడాలి. ఏమిటా పరీక్ష యింకా అట్లాగే చూస్తో? నా ఉద్యోగం బాగానే వుంది. రోజుకి కోటిరూపాయలు వచ్చిపోతుండే బ్యాంక్‌లో కదా? వూ.. యివన్నీ చెప్పినా సంతృప్తి లేదు కదూ! మై డియర్! నేనింకా పెళ్ళి చేసుకోలేదు" అని నవ్వేసింది.

నేను నవ్వి తల దించుకుని, "అవును. తెలుస్తూనే వుంది నీకింకా పెళ్ళి కాలేదని?" అన్నాను.

"తెలిసినా కానీ, ఎంచేత అని నీకు పెద్ద అనుమానం కదూ" అంటూ ప్రశ్న వేసింది మళ్లీ.

ఒకప్పుడు నీరజ నేను చాలా దగ్గిర స్నేహితులం. ఒకరినొకరు క్షణం కూడా విడువకుండా హాస్టల్లో, కాలేజీలో గడిపిన వాళ్ళం. అందుకే నా ఆలోచనలన్నీ యిట్టే చదివినట్లు పసిగడుతుంది. ఇల్లాగే వాద ప్రతివాదాలుగా మా సంభాషణ సాగితే, అసలు విషయం తేలడానికి మరో గంట కావాలి.

అందుకే విషయం తుంచేసి, టూకీగా తేల్చాలని నిశ్చయించుకున్నాను. "అవును. నీకింకా ఎందుకు పెళ్ళి కాలేదా అనే నా సందేహం. నీలాంటి మనిషికి పెళ్లి జరగకపోవటం చాలా ఆశ్చర్యమైన విషయం. నీలో ఆకర్షణ వుంది. మగవాళ్ళని లాగి పట్టగలిగిన స్త్రీత్వం వుంది. ఇంకా ఎంచేత నువ్వు విముఖంగా వున్నావు అనే నా సందేహం" అన్నాను. నా శక్తినంతా కూడదీసుకుని, యింత ధాటిగా వేశాను ప్రశ్నలు. ఎంచేతనంటే నీరజలో నాలోలేని ఒక పదుచుదనం పొగరు తొంగి చూస్తోంది. ఆ ధాటికి నేను నిలవలేననిపించింది.

"ఇంతేనా? యింకా ఏదైనా అడుగుతావా?" అన్నది కాఫీ తాగేసి, కప్పు పక్కకి నెట్టి.

"నీకు వయస్సు పెరుగుతుంటే, చేతిలో డబ్బు పెరుగుతోంటే, కనీసం ఖర్చు పెట్టుకునేందుకైనా ఒక తోడు కావాలి. మనసులో మనసైన మనిషి వుండాలి. ఇక నీ అభిప్రాయం ఏమిటి?"

నీరజ ముఖం మెరుపు తుడిచేసిన మబ్బుల ఆకాశంలా అయింది. "నీతో అబద్ధమాడలేను. డొంక తిరుగుడు జవాబులు చెప్పలేను. చూడు, యీ జీవితం ఏముంది చెప్పు! రెండు బిందువుల మధ్య ఒక గీత, పుట్టుక, చావు. ఈ రెండింటి మధ్యన వున్న ఒక గీత. జానెడులేని యీ గీత మీద బతకడానికి మరో సాయం అనవసరం. మరో మనిషి చిరునవ్వులకీ, చిరుకోపాలకీ అర్థాలు వెతికేంత ఓపిక నాకు లేదు. తోడా? నా ఆలోచనలే నాకు బరువవుతోంటే, మరో మనిషి మనస్సులోని భావాలూ, బాధలూ ఎక్కడ పట్టించుకోనూ?" అన్నది. కొంచెం ఆగి, చిన్న చిరునవ్వుతో చూసింది నా వంక. "నా కొంగుకి ఒక ముడి వేస్తే అది మరో బరువు. ఇప్పుడు నాకు వచ్చిన లోటేముంది? హాయిగా వున్నాను. పెళ్ళిలో పడి, మునిగి, ఈతరాక అవస్థలు పడేకంటే, ఇల్లా ఒడ్డున కూర్చోడమే బావుంది. చాలా ఆలోచించాక పెళ్ళి అనే పదాన్ని నా డిక్షనరీలోంచే తీసేశాను. అంత అవాంతరంగా ఒక ప్రేమ నన్ను ముంచడం కలలో సంగతి. వూ అదేమిటి, కాఫీ యింకా తాగవేమిటి?" అన్నది.

ఒక కొంగుకి ఒక ముడి బరునా? పిచ్చిదానా, ఆ బరువుకోసమే లక్షలమంది కన్నెపిల్లలు కలలు గంటున్నారు. వారి అమ్మ, నాన్నలు అలమటించి పోతున్నారు అనుకున్నాను. కానీ, కాఫీ హోటల్లో బల్ల ముందు కూర్చుని, గబగబ వాదించి, తేల్చవలసిన విషయం కాదిది. కాఫీ గొంతులో పోసుకుని, "ఓకే. యింకా ఏమిటి చెప్పు విశేషాలు?" అంటూ తేలిగ్గా మాట్లాడే యత్నంతో లేచాను.

*

బస్స్టాండు ఒక రైల్వే ప్లాట్‌ఫారంలా ఉంది. "హల్లో!" పెద్ద కేక నా పక్కనే, నా భుజం మీద చేయి పడింది. శకుంతల! నా కళ్ళల్లో తడి సంతోషంతో. తన కళ్లల్లో మెరిసిపోతున్న ఆనందం నన్ను చూసి. స్నేహమంటే యిదే. తనని చూడడంతోనే ఎందుకో నా మనసిల్లా పొంగింది సముద్రంలా. చేతులతో దగ్గరగా లాక్కోవాలన్న ఆప్యాయత నన్నూపేస్తోందే!

"శకూ!" అన్నాను. "రా, పార్కులో కూర్చుందాం కాస్సేపు" అన్నది. నా చేయి వదలలేదు. ఇద్దరం గొప్ప ప్రేమికుల్లా నడుస్తూ బయలు దేరాం పార్కులోకి. అరటి పళ్ళు , పల్లీలు కొనుక్కున్నాం. తింటూ కబుర్లు ప్రారంభించాం. నేను బస్సు మాటే మర్చిపోయినట్లుగా కూర్చుండిపోయాను. ఒకరినొకరు చూసుకోవడంతోనే సరిపోతున్నది. కాస్సేపయ్యాక అడిగాను.

"శకూ! నీ పిల్లలు నలుగురూ బుద్ధిమంతులేనా? మీ వారిని ఒక్కసారే చూచాను పెళ్ళిలో.ఇప్పుడెలా వున్నారు? ఈపాటికి నువ్వింకా రాలేదని వాళ్ళంతా ఎదురు చూస్తుంటారేమో!" అన్నాను.

"ఔనమ్మా, వెళ్ళాలి. పోనీలే గానీ, యింకా చెప్పు. మనవాళ్లెవరైనా కలుస్తోంటారా ఎప్పుడేనా?" అన్నది శకుంతల.

""ఎవరో ఒకరు కనిపిస్తోనే వుంటారు గానీ, చెప్పు నీ పిల్లల్ని గురించీ,మీ ఆయన్ని గురించీ. సంతోషంగా కబుర్లు చెప్పవేం శకూ, అంత యిష్టపడి పెళ్లి చేసుకున్నావు?" అన్నాను చనువుగా.

"ఏముందే చెప్పేందుకు? సంతోషంగానే వున్నాను.సరేనా? నా పిల్లలు బాగానే చదువుకుంటున్నారు. నేనంటే వాళ్ళందరికీ చాలా ఇష్టం. అంతే కదా నీ సందేహం?" అన్నది పొడిపొడిగా.

ఈ మాటల్లో నిండైన ఆనందం ధ్వనించడం లేదే? నేను చాలా అదృష్టవంతురాలినే అంటుందేమోనని ఆశపడుతున్నాను. కానీ ఆమె మాటలు అల్లా లేవు. చిన్న కొరత.

"శకుంతలా! చల్లని సంసారంలో పచ్చని గృహలక్ష్మిలా బతుకుతున్న నువ్వు యిల్లా ముక్తసరిగా మూడు ముక్కల్లో తేల్చేస్తావేమిటి నీ సౌభాగ్యం గురించి? నేనింత ప్రాణస్నేహితురాల్ని కదా! నువ్వు సుఖంగా వున్నావని వింటే సంతోషించే నాతోనే ఎందుకిల్లా మాట్లాడుతున్నావు. ఏదో దాస్తున్నట్లు?" అన్నాను.

శకుంతల నా కళ్లలోకి చూసింది. చిన్నగా ముడుచుకున్నాయి ఆ కళ్ళు. "ఏం చెప్పను! నాకు బతుకులో సారం ఏమిటో తెలిపోయిందే! అందరం మరొకరికి సుఖం ఇవ్వడానికే పుట్టాము. ఎంత దగ్గరయినా, ప్రతి యిద్దరి మనుష్యుల మధ్య ఒక పెద్ద అగాధం వుంటుంది. భార్యకీ, భర్తకీ మధ్య. తల్లికీ, పిల్లకీ మధ్యన కూడా ఆ అగాధం వుంటూనే వుంటుంది.

"ఒకరినొకరు అతి దగ్గరగా వుండేది కొన్ని నిముషాలే! ఆతర్వాత ఎవరికి వారే! ఎవరి గుండె వారిదే. ఎవరి గుండె చప్పుడు వారిదే. ఎదుటి గుండె మనకి వినబడదే? సంసారం సాగరం అన్నారా. నేను అందులో పడి, మునిగి తట్టుకుని, వూపిరాడక అలసిపోయాను. ఏ కెరటం. ఏగాలి ఎటు తోస్తే అటు పోవడమే నా పని. ఆ సముద్రంలో ఇంక నాకు ఆనందమేమిటి? నా విధి ఏదో నేను నెరవేర్చాలి. అంతే. పొంగి పోయేందుకు ఏమీ లేదు ఇందులో. ఇదంతా యింత వివరంగా తేలేక, నా సౌభాగ్యాన్ని గురించి నీతో ఏమి గొప్పలు చెప్పుకోమంటావు?" అన్నది.

ఆ చిరుచీకట్లో, నేను తెల్లబోయాను. పిచ్చిదానా, యిష్టమైన ఒక జత కళ్ళల్లోకి చూస్తూ, ఎగసిపడే గుండెను ఏం చేయాలో తెలియక తబ్బిబ్బవుతారు అమ్మాయిలు. చిటికెన వ్రేలి కదలికలో తన ప్రాణ ప్రియుని మనోభావం గుర్తించి, మనస్సులో మనస్సుగా బ్రతుకుతారు యిల్లాళ్ళు! అమ్మా అనే తేనె పిలుపులోని తీపిని జుర్రి మత్తెక్కిన కళ్ళతో లోకాన్నే చిన్న చూపు చూస్తారు తల్లులు. మరి నువ్వెందుకమ్మా యింత తేలిగ్గా మాట్లాడుతున్నావు నీ సంసారం గురించి! అన్నవి నాలో గిర్రున తిరిగే ప్రశ్నలు.

ఇద్దరం గూళ్ళకి చేరవలసిన పక్షులం. ఇప్పుడు నేను వేసే ప్రశ్నలు కావు యివన్నీ.

రైల్వే ప్లాట్‌ఫారం లాంటి బస్సుస్టాండుకి నేను రోజూ వస్తూనే వున్నాను. అప్పుడప్పుడు అటు నుండి వస్తుండే నీరజ. యింకా వడ్డునే కూర్చున్నది. ఇటు నుంచి వచ్చి, తారసపడే శకుంతల నిండా మునిగే వున్నట్లు కనిపిస్తుంది. ఏంచేతో యిద్దరికీ, యీ సంసార సాగర సౌందర్యం కంటికి ఆనడం లేదు. రసహీనమైన ఒకే పల్లవి ఆలపించారు నా చెవుల్లో.

సుమధురమైన ఆ సాగర సంగీతమే వినబడని వాళ్ళకి, నీరసమైన నా మాటలేం వినబడుతాయి! ఆ రెండూ కలసిన ధృవాలు!

***